శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# దివ్యాంగులకు ఆసరా కల్పించిన విపిఆర్ ఫౌండేషన్



**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** పరుల బాధను తమ బాధగా భావించి కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడమే పరమావధిగా వేమిరెడ్డి దంపతులు తమ ఉదారతను చాటుకుంటూనే ఉన్నారు. నడవలేని పాదాలకు విపిఆర్ ఫౌండేషన్ తోడు కావడంతో దివ్యాంగుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. మాగుంట లేఅవుట్‌లోని తమ నివాసంలో సోమవారం కోవూరు, కావలి, కందుకూరు నియోజకవర్గాలోని 10 మంది దివ్యాంగులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి బ్యాటరీ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ అధికారం అనేది ప్రజలకు సేవ చేయడానికి దక్కిన ఒక అవకాశమని, ప్రతి దివ్యాంగులు ఆత్మ విశ్వాసంతో బ్రతకాలి అనేది తమ ప్రధాన ఆకాంక్ష అన్నారు. రానున్న రోజుల్లో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, మార్చి 2, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 1143 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 65.110 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి 700, పెన్నా డెల్టా 1000 క్యూసెక్కు ల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 98.789 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# కలెక్టర్ చొరవతో నా ఇల్లు నాకు వచ్చిందయ్యా...!

- నా అర్జీకి న్యాయం జరిగింది - కృతజ్ఞతతో కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధురాలు







**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 2, ప్రభాతవార్త** ప్రజల అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగుతుందనే భావన ఉన్న నేపథ్యంలో, ఒక వృద్ధురాలి కృతజ్ఞతాభావం జిల్లా యంత్రాంగంపై ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచింది. అర్జీ ఇచ్చామా.. పని అయిపోయిందా.. వెళ్ళిపోయామా" అన్న భావనకు భిన్నంగా, తన సమస్యను పరిష్కరించిన అధికారులకు ధన్యవాదాలు చెప్పేందుకు ప్రత్యేకంగా కలెక్టరేట్‌కు రావడం విశేషంగా నిలిచింది. హిమాన్షు శుక్ల నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిర్వహించిన తొలి గ్రీవెన్స్‌డే (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో అందిన మొట్టమొదటి అర్జీ ఇదే కావడం విశేషం. వృద్ధురాలు తన సమస్యను వినిపించగానే, కలెక్టర్ మానవీయ దృక్పథంతో స్పందించి, వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రాధాన్యం" అనే సందేశాన్ని ఆయన చాటిచెప్పారు.

**యుద్ధ ప్రాతిపదికన చర్యలు - శాశ్వత పరిష్కారం**

కలెక్టర్ ఆదేశాలతో అధికారులు ఆలస్యం చేయకుండా క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టారు. సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యను పరిశీలించి, శాశ్వత పరిష్కారం చూపించారు. చిరకాలంగా ఎదురుచూస్తున్న సమస్య ఒక్క అర్జీతో పరిష్కారమవడంతో వృద్ధురాలి ఆనందానికి అవధులు లేకపోయాయి.

**శరీరం సహకరించకపోయినా.. కృతజ్ఞత చెప్పాలనే తపన**

వయస్సు పైబడి, ఆరోగ్యం సహకరించకపోయినా.. తన సమస్యను పట్టించుకుని తన కుమారుని నుంచి తన ఇంటిని తనకు ఇప్పించిన కలెక్టర్ కు స్వయంగా కృతజ్ఞతలు చెప్పాలని ఆమె నిర్ణయించుకున్నారు. కుటుంబ సభ్యుల సహకారంతో అతి కష్టం మీద కలెక్టరేట్‌కు చేరుకున్నారు.ఆ సమయంలో జిల్లా అభివృద్ధి పై సీఎం గారితో సమావేశం వున్నందున కలెక్టర్ విజయవాడకు వెళ్లి వున్నందున అందుబాటులో వున్న జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్ఓ విజయ్ కుమార్‌ను ఆమె కలిశారు. వారికి మిఠాయిలు అందజేసి, మనస్ఫూర్తిగా దీవించారు. ఈ సంఘటన అక్కడి సిబ్బందిని కూడా భావోద్వేగానికి గురిచేసింది. ఒక సామాన్య వృద్ధురాలి కృతజ్ఞత, జిల్లా యంత్రాంగం పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబించింది. ప్రజల అర్జీలపై తక్షణ స్పందన, మానవీయ దృక్పథం ఉంటే పరిపాలన ఎలా ఉండాలో ఈ సంఘటన చూపించింది. ప్రజల సమస్యల పట్ల చొరవతో ముందుకెళ్తున్న జిల్లా యంత్రాంగానికి ఇది ఒక ప్రేరణాత్మక ఘట్టంగా నిలిచింది.

**సమస్య నేపథ్యం ఇది...**

గత సంవత్సరం సెప్టెంబర్ 22వ తేదీన కావలి కి చెందిన రమా జ్యోతి అనే వృద్ధురాలు నడవలేని స్థితిలో నెల్లూరు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి కింద కూర్చొని ఉండగా అటుగా వెళుతున్న కలెక్టర్ గమనించి నేరుగా ఆమె వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత నిర్వహించిన మొదటి పి జి ఆర్ ఎస్‌లో మొట్టమొదటి అర్జీని ఆమె వద్ద నుండి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్వీకరించారు. ఆమె పెద్ద కొడుకు తనను మభ్యపెట్టి తాను నివసిస్తున్న ఇంటిని తన పేరు మీద రాయించుకుని తనను ఇంటి నుంచి వెళ్లగొట్టాడని, నిలువ నీడ లేకుండా చేశాడరని వాపోయింది. తక్షణమే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులు పిలిచి ఆమెకు వెంటనే న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి ఆమె ఇంటిని ఆమెకు గౌరవంగా జిల్లా కలెక్టర్ అప్పగించారు. తన ఇంటి సమస్య పరిష్కారం కావడంతో సోమవారం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓకు మిఠాయిలు అందజేసి, కృతజ్ఞతలు తెలిపిన వృద్ధురాలు రమా జ్యోతి.

# బీద రవిచంద్ర తో నూతన మేయర్ సుజాత భేటీ



**నెల్లూరు, మార్చి 2, ప్రభాతవార్త-వైద్యం :** నూతన మేయర్ గా ఎన్నికైన దేవరకొండ సుజాత నెల్లూరు నగరంలోని మాగుంట లే అవుట్ లోని శాసన మండలి సభ్యులు ,టీడీపీ నెల్లూరు జిల్లాఅధ్యక్షుడు బీద రవిచంద్ర నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ సుజాత బీద రవిచంద్ర ను సాలువతో సత్కరించారు. బీద రవిచంద్ర మేయర్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేయర్ సుజాతను సన్మానించిన బీద రవిచంద్ర దంపతులు ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించుకున్నారు.

# జాతర పై అన్ని శాఖల అధికారులతో సమీక్షా



**గూడూరు, మార్చి 2, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంచార్జి ఆర్డీవో నాగ సంతోష అనూష ఆధ్వర్యంలో చిల్లకూరు మండలం లోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఈనెల 10వ తేదీ నుండి జరగనుంది. ఈ నేపథ్యంలో ఇంచార్జి ఆర్డీవో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జాతరను జయప్రదం చేయాలన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరు విధిగా తమ కు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి జాతరను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్డిఓ నాగ సంతోషా అనూష, డిటిసి డిఎస్పి గిరిధర్, డి ఎల్‌డివో వాణి రెడ్డి, ఆలయ ఈవో కె, నవీన్ కుమార్, తాసిల్దార్ ఆర్.వి.ప్రసాద్, సీఐ కిషోర్ బాబు, ఎస్ఐలు సురేష్ బాబు, పవన్ కుమార్ ఆలయ చైర్మన్ చిల్లకూరు దశారథరామి రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జన్మభూమి సేవలో ప్రేమ సాగర్ రెడ్డి

**చెన్నై శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం**

**సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**




**వెంకటాచలం మార్చి 2, ప్రభాతవార్త** పుట్టిన జన్మభూమి గ్రామస్తులకు రుణం తీసుకునేందుకు ప్రేమ సాగర్ రెడ్డి కంకణం కట్టుకున్నాడని సర్వేపల్లి శాసనసభ్యులు చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. నిరుగుంట పాలెం గ్రామంలో పుట్టి విద్యాభ్యాసం చేసి అంచులచ్చులుగా చదివి అమెరికాలో వైద్యరంగంలో ఉన్నత స్థానంలో ఉన్న వనమాల ప్రేమ సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాలయం సమస్త పేదలకు ఉచితంగా కంటి వైద్య శిబిరాన్ని వారం రోజులు పాటు ఏర్పాటు చేయనున్నారు. ఈ వైద్య శిబిరాన్ని సర్వేపల్లి శాసనసభ్యులు స్వామి రెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. తన సొంత గ్రామానికి ఇప్పటికే విద్యా వైద్య రంగానికి సంబంధించిన అనేక వసతులు ఏర్పాటు చేశారు అన్నారు. విద్యార్థులకు హైస్కూల్ భవనాలు హాస్టల్ గదులు గ్రామంలో ప్రతి ఈధికి సిమెంట్ రోడ్లు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారము తదితర వాటిపై ఇప్పటికే ప్రేమ సాగర్ రెడ్డి తన సొంత ట్రస్టు ద్వారా గ్రామాన్ని అభివృద్ధిగారన్నారు. ఇంతటి ఆశ్చర్యం ఉన్న ప్రేమ సాగర్ రెడ్డి మరో మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. పేదలకు కంటి చూపు కోసం పది రోజులు పాటు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి పరీక్షలు చేసి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రేమ సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ కార్యక్రమాలు చేపడుతున్న రవీందర్ రెడ్డి శ్రీహరి రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ప్రతి ప్రాథమిక పాఠశాలల్లో మినీ గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి

**పుస్తకపఠనంతోనే ఉజ్వల భవిష్యత్తు బి.సుధీర్ బాబు, ఎంఎంఓ, సమగ్ర శిక్ష**



**వెంకటాచలం మార్చి 2, ప్రభాతవార్త** మండలంలోని కంటేపల్లి బిది ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు బ్లూమ్స్ విత్ బుక్స్, లెర్న్ అండ్ హెల్ప్ టీం పుస్తకలతో వికాసం ట్రస్ట్ హైదరా బాద్ వారు పదివేలు విలువైన పుస్తకాలు, సమగ్ర శిక్ష ఇచ్చిన పుస్తకాలు తో కూడిన పాఠశాల గ్రంధాలయమును జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి బి. సుధీర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు ప్రతి రోజూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, పుస్తకాలు చదివి మెదస్సు పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. చెముడుగుంట క్లస్టర్ హెడ్మాస్టర్ లీ.అరుణ మాట్లాడుతూ పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలి అని విద్యార్థులను సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొమ్మలాట పార్వతీశం మాట్లాడుతూ పుస్తకాలుచదివి అందులోని నీతిని గ్రహించాలని కోరుతూ పాఠశాలకు పదివేలు రూపాయలు పుస్తకాలు అందించడంలో దాతలు డాక్టర్ జాస్తి శివరామకృష్ణ,డాక్టర్ దితి ప్రసాద్ లకు కృతజ్ఞతలు తెలిపారు. స్టూడెంట్ బ్యాంక్ ఆఫ్ కంటేపల్లి (SBK) ను, స్కూల్ రేడియో,స్కూలుకు సంబంధిన పాటల సీడీ ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ప్రతీ రోజు జరిగే వినూత్న కార్యక్రమాలు, విద్యార్థుల కృత్యాలను అభినందిస్తూ...వాటితో పాఠశాల మాసపత్రిక ను ప్రారంభించాలని సూచించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఆదర్శ పాఠశాల తగినట్టుగా ఆదర్శవంతంగా పాఠశాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు ఉపాధ్యాయులను అభినం దించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీ. పార్వతీశం, సహోపాద్యాయులు విజ య,M. శ్రీధర్ రవీంద్ర. రామమోహన్ పాల్గొన్నారు.

# గరుడ వాహనంపై ఊరేగిన ... శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి



**బిట్రగుంట మార్చి 2 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండ బిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామికి గరుడ సేవ మహోత్సవం నిర్వహించారు. అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గరుడసేవొత్సవాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు హర్షద్వానాల మధ్య శ్రీ ప్రసన్నుడు కొండబిట్రగుంట,పాత బిట్రగుంట పురవీధుల్లో గరుడ వాహనంపై విహరించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూల నుండి భక్తుల అశేషంగా తరలివచ్చారు. ఉత్సవ నిర్వహణను ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి కార్య నిర్వాహణాధికారి అరవ రాధా కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించగా, కావలి డి.ఎస్.పి శ్రీధర్ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు నిర్వహించారు.



# నిర్ణీత గడువులోపు అర్జీల పరిష్కరణ

- పరిష్కార వేదికకు 374 అర్జీలు



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 2 ప్రభాతవార్త** సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, డిప్యూటి కల్కర్ మురళి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి శ్రీధర్ రెడ్డి, డిపిఓ వసుమతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డి.డి నాగ శేఖర్, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు మరియు పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బియాండ్ యస్.యల్.ఏ పోకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులు నెం.06ను అనుసరించి జిల్లాలోని అన్ని శాఖలలో అర్హత కలిగిన వారందరికీ త్వరితగతిన పదోన్నతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అవసరమైన శాఖలలో పానల్ జాబితాలను తయారు చేసి పదోన్నతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని శాఖలలో ఎప్పటినుంచో సర్వీస్ లో ఉంటూ పదోన్నతులు పొందని వారు ఇంకా ఉన్నారని క్రిమినల్ కేసులు లేని శాఖ పరమైన కేసులు లేని వారందరికీ అవకాశం కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ వారి పేర్లతో వివిధ శాఖలలో మనుగడలో లేని అకౌంట్లు వివరాలను అందించాలని ఆయన అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లును జిల్లా అధికారులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీల స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతపాటు షామ్యానలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజాపిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమములో డిప్యూటి కలెక్టర్ మురళి, డిపిఓ వసుమతి, పిడి డిఆర్‌డిఎ నాగ రాజ కుమారి, బిసి సంక్షేమ అధికారి వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గ్రంధాలయాన్ని దేవాలయంగా మారుస్తా



**నెల్లూరు, మార్చి 2, ప్రభాతవార్త-వైద్యం :** ప్రమాణ స్వీకారం రోజు చెప్పా. చెప్తున్నా గ్రంథాలయాన్ని దేవాలయంగా మారుస్తా. **నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి** మా సమస్యలు పరిష్కరించండి జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ కి వివరించిన నిరుద్యోగులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తా నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి సోమవారం నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి ఛాంబర్ లో ఆమె ను కాంపిటేటివ్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు కలిసి జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాంపిటేటివ్ పరీక్షలకు సన్నద్ధం అవ్వడానికి బుక్స్ లేవని, కూర్చోవడానికి కుర్చీలు లేవని సరైనటువంటి సదుపాయాలు లేవని చైర్ పర్సన్ కి నిరుద్యోగులు సమస్యలు వివరించారు. తక్షణమే పరిష్కరించే సమస్యలన్నీ త్వరగా పరిష్కరిస్తానని మీ సమస్యల పరిష్కరించే దానికి నా సొంత నిధులతోనైనా పరిష్కారం చేస్తానని నిరుద్యోగులకు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారిహామీ ఇచ్చారు. మొదటిసారి చైర్ పర్సన్ ని కలిసి సమస్యలు వివరించుకున్నామని మేడం ఇచ్చిన భరోసా సంతోషాన్ని కలిగించిందని, గ్రంథాలయ అభివృద్ధిలో మా వంతు సహకారం మేడంకి అందిస్తామని తెలియజేశారు..

# 11న ముగియనున్న బిపిఎస్ పథకం

**బిపిఎస్‌పై అర్హులందరికి అవగాహన కల్పించండి**



**నెల్లూరు కార్పోరేషన్, మార్చి 2 ప్రభాతవార్త :** బిపిఎస్ పథకం 11వ తేదీతో ముగియనున్నందున పథకంపై అర్హులందరికి అవగాహన కల్పించి తప్పనిసరిగా ధరఖాస్తు చేసుకునేలా ప్రతి ఒక్క ప్లానింగ్ కార్యదర్శి చర్యలు తీసుకోవాలని కమిషనర్ వైఓ.నందన్ సూచించారు. ఎల్ఆర్ఎస్ పథకంపై అనదికార లేవుట్ల యజమానులు, అనధికార లేవుట్లత ప్లాట్లు కలిగిన యజమానులకు కూడా అవగాహన కల్పించి తప్పినిసరిగా రెగ్యులరైజ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్, కమిషనర్ వైఓ.నందన్‌లు పాల్గొని అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ అర్హులైన లబ్దిదారులందరూ 300చ.అ ఉచిత టిడ్కో గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నోటీసులు ఇచ్చినా గృహాలకు రిజిస్ట్రేషన్ చేసుకోకుండా స్వాదీనం పొందని 408టిడ్కో గృహాలను అర్హులైన ఇతరులకు పిఎం అవాస్‌యోజన 2.0ద్వారా ఈ వారంలో అందజేసేందుకు ప్రతిపాదనలను సిద్దం చేశామని కమిషనర్ ప్రకటించారు. రాష్ట్ర హౌసింగ్ బోర్డు కార్పోరేషన్ ద్వారా నిర్మించిన లైవుట్లలోని గృహలను లబ్దిదారుల స్వాదీనం పొంది నివాసం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. టిడ్కోగృహాల కోసం ధరఖాస్తు చేసుకునే వారు సచివాలయంలో లేదా నగరపాలక సంస్థలో హౌసింగ్ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. సంస్థకు చెల్లించాల్సిన పన్ను బకాయిదారులకు సంబందించిన విభాగాల నుంచి నోటీసులను జారీ చేశామని వారంతా జిల్లా ప్రధాన న్యాయస్థానంల ఈనెల 14వ తేది శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌కు హాజరు కావాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆస్థిపన్ను బకాయి రూ.150కోట్లు, ఖాళీస్థలం పన్నులు రూ.20కోట్లు తాగునీటి కొళాయి పన్నులు రూ.32కోట్లు మొత్తం సుమారుగా రూ.200కోటుల బకాయిలు ఉన్నాయని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో విభాగాల వారీగా టిడ్కోహౌసింగ్ 14, ప్లానింగ్ 8, రెవెన్యూ 5, ఇంజనీరింగ్ 4, పబ్లిక్‌హెల్త్ 8, హెచ్ సెక్షన్ 1, పెన్షన్ 1, ఆప్కాస్ 1, బిఎస్‌డబ్ల్యుఎస్ 1, మొత్తం 43 వినతులను కమిషనర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్‌ఈ రహంతుజానీ, సిటి ప్లానర్ రఘునాధరావు, ఈఈ శేషగిరిరావు, అనీల్‌కుమార్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దినేష్, టిపిఆర్ఓ వాసుబాబు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అగ్ని మాపక బాధితులకు.. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దాతృత్వం



**బుచ్చి మార్చి 2 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని శాంతినగర్ కార్పెంటర్‌గా పనిచేసుకుంటున్న కరిముల్లా దుకాణంలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో పరికరాలన్నీ అగ్నికి ఆహుతి అయ్యాయి. దీంతో దిక్కు తోచని స్థితిలో ఉన్న వారి కుటుంబ పరిస్థితిని క్లస్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లారు. తక్షణమే స్పందించిన ఆమె ఆకుటుంబానికి 50 వేల రూపాయాలు ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబానికి అండగా నిలబడ్డారు. దీంతో కరిముల్లా కుటుంబసభ్యులు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి స్థానిక క్లస్టర్ ఇంచార్జి వింజం రామానాయుడుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి 14 ఫిర్యాదులు



**నెల్లూరు, మార్చి 2, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరులోని విద్యుత్ భవన్ నందు ఆంధ్రప్రదేశ్ దక్షిణ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని డివిజన్ల నుండి మొత్తం 14 ఫిర్యాదులు అందినట్లు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం తెలిపారు. ఈ ఫిర్యాదులు ముఖ్యంగా రోడ్లు వేసిన కారణంగా పోల్ హైట్ తగ్గిన అంశాలు, బార్బర్ షాపుకు ప్రభుత్వ రాయితీ మంజూరు, త్రీఫేస్ కన్వర్షన్, మీటర్ రీడింగ్ సమస్యలు, లో ఓల్టేజి సమస్యలు, వ్యవసాయ నూతన సర్వీసులు, గృహ విద్యుత్ సర్వీసులకు టైటిల్ ట్రాన్స్‌ఫర్ తదితర అంశాలకు సంబంధించినవిగా ఉన్నాయని వివరించారు. అందిన ప్రతి ఫిర్యాదును చాలా సీరియస్‌గా తీసుకొని, సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లకు వెంటనే తెలియజేసి, సమస్యల రెక్టిఫికేషన్ పూర్తి చేసిన అనంతరం ఫొటోతో సహా నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(టౌన్) శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునీంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్లు తిరుపతయ్య, నరసింహారావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## ఉచిత మంచినీటి చలివేంద్ర ప్రారంభం



**బిట్రగుంట మార్చి 2 ప్రభాతవార్త :** బోగోలు మండలం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్స వాలు సందర్భంగా సోమవారం కావలి డివిజన్ పశుగుణాభివృద్ధి సమస్త వారి కావలి డివిజన్ గోపాల మిత్రుల ఆధ్వర్యంలో చలివేంద్రమును ఏర్పాటు చేసి ఉచితంగా భక్తులకు మంచినీళ్లు పంపిణీ చేసినారు ఈ కార్యక్రమాన్ని లోక్ అదాలత్ సభ్యులుఎం మాలకొండ రెడ్డి రాష్ట్ర యానాది సంఘాల మహాకూటమి ఉపాధ్యక్షులు జయంపు కనకయ్య ప్రారంభించినారు ఈ కార్యక్రమాన్ని గోపాల మిత్రులు కే శ్రీనివాసులు ఎం మోహన్ రావు జి కొండయ్య పి తిరుపతి సిహెచ్ ప్రసాద్ ఎం శివాజీ కె వీరు భక్తులకు మంచినీరు సప్లై చేస్తూ మానవసేవే మాధవ సేవ అని భక్తులకు శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకి వచ్చే భక్తులకు నిరంతరం మంచినీళ్లు సప్లై చేసే చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమని వారి సేవలను కొనియాడినారు ఈ కార్యక్రమంలో ప్రజలు భక్తులు పాల్గొన్నారు .

## ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి



**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో ప్రస్తుతం వరికోతలు ప్రారంభం అయ్యాయని, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోవూరు రైతు సంఘం కార్యదర్శి ఎస్కే బాబు తెలిపారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో సీపీఎం మండల కమిటీ ఆదేశాల మేరకు వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ధాన్యానికి మద్దతు ధర కల్పించాలంటూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలాలు కష్టించి పండిస్తే తీరా కొనుగోలు సమయంలో దళారుల దెబ్బకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బషీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు బుజ్జయ్య, శేషయ్య, తదితరులు ఉన్నారు.

## తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడులోని పలు వరి పొలాలను సోమవారం సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా పలు చోట్ల వరిలో కాండం కుళ్లు తెగులు సోకిందని గమనించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దీని నివారణకు గానూ ట్రిబ్యుకోనజోల్ 300 గ్రాములు ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వరిలో పలు ప్రాంతాల్లో సుడిదోమ ఎక్కువగా ఉం దని, దాని నివారణకు గానూ పైమెట్రోజైన్ 120 ఎంఎల్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి రజని, గ్రామ వ్యవసాయ సహాయకులు కీర్తన, రైతులు ఉన్నారు.

## కృత్యంతర బోధనపై దృష్టి సారించాలి



**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అభ్యసిస్తే వారు దానిని సులువుగా ఆకలింపు చేసుకుంటారని ఎంఈవో-2 వై. చెంచు లక్ష్మమ్మ అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీ పరిధిలోని పలు ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆమె ఆకస్మిక పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వలన విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై కూడా అవగాహన కల్పించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

## పుల్లనీళ్ళపల్లిలో సిసిరోడ్డు పనులు ప్రారంభం



**చేజర్ల మార్చి 2 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని పుల్లనీళ్ళ పల్లి ,పెళ్లూరు పంచాయితీ పరిధిలోనిఎస్‌సి కాలనీలో మహా త్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీహామి పథకంద్వారా 13 లక్షల రూపాయల నిధులతో సిసిరోడ్లు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేజర్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్ ,మండల తెలుగుదేశం పార్టీసీనియర్ నాయకులు కొమ్మి సిద్దులు నాయుడు, భారత్ మహాసేన నాయకులు జువ్విగుంట బాబు టిడిపి గ్రామ నాయకులు గోరిపర్తి రవి సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెల్లేరులో ఎన్‌టిఆర్ భరోసా పెంన్లు పంపీణి



**చేజర్ల మార్చి 2 ప్రభాతవార్త :** చేజర్ల మండలం పెల్లేరు పంచాయితీలోని పుల్లనీళ్ళపల్లి గ్రామంలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్‌పంపిణీ సోమవారం కూడా నిర్వ హించారు.ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్ తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకులు కొమ్మి సిద్దులు నాయుడు మహాసేన నాయకులు జూగుంట బాబు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## భూమి హక్కులకు పూర్తి భద్రత పాస్ పుస్తకంపాశం శ్రీహరి రెడ్డి



**విడవలూరు,మార్చి 2 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు భూ యాజమాన్య హక్కులకు భరోసాగా అధికారికంగా జారీ చేసిన రాజముద్ర పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు అందజేయడం సంతోషకరమైన విషయమని ఈస్టన్ ఛానల్ డిస్ట్రిబ్యూట్ కమిటీ చైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం సచివాలయంలో గ్రామసభ కార్యక్రమం తహశీల్దార్ కె. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విడవలూరు సొసైటీ చైర్మన్ పొన్నలూరు పురంధర్ రెడ్డి మాట్లాడుతూ ఏ వ్యక్తిగత చిత్రాలు లేకుండా కేవలం ప్రభుత్వ రాజముద్రతో రైతులకు ఇవ్వడం, భూమి హక్కులకు పూర్తి భద్రత కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆయన అన్నారు. అనంతరం రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ అబ్దుల్ సలాం, గ్రామ విఆర్వో దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పొలాల్లోకి దూసుకుపోయిన కారు తప్పిన ప్రమాదం



**కొడవలూరు, మార్చి2 ప్రభాతవార్త:** మండలంలోని టపాతోపు గేటు నుండి కొడవలూరు వైపు వెళుతున్న కారు పొలాల్లోకి దూసుకుపోయిన సంఘటన పెద్ద కాలువ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు వివరాలు ఇలా ఉన్నాయి కాలువ వంతెన నుండి వస్తు రోడ్డు మార్గంలో గుంత ఉండడంతో తప్పించబోయి పొలాల్లోకి దూసుకెళ్లింది.కారులో ప్రయాణిస్తున్న వారికి ప్రమాదం తప్పింది అందరూ సురక్షితంగా ఉన్నారు

## ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు



**తోటపల్లి గూడూరు, మార్చి 2, ప్రభాతవార్త:** ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలు విద్యా ప్రమాణాల్లో ఏమాత్రం తగ్గవని నరుకూరు ఎంపీటీసీ కోణతం రఘుబాబు అన్నారు. సోమవారం నరుకూరు యూపీ పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల పల్లెపాడు డైట్ కళాశాలలో నిర్వహించిన భాషా దినోత్సవం సందర్భంగా హిందీ భాషలో ప్రతిభ చూపిన విద్యార్థులు డీఈవో చేత ప్రశంసలు అందుకున్నారు. అలాగే శనివారం నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో ప్రదర్శనల ద్వారా ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా సన్మానించింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కొణతం రఘుబాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల ఎంఈఓలు వేణుగోపాల్ రెడ్డి, జయరామా నాయుడు విద్యార్థుల ప్రతిభను కొనియాడి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి బీసీ తెలుగు పాఠశాల ఆకస్మిక తనిఖీ



**ఉదయగిరి, మార్చి 2, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి బీసీ కాలనీలోని పాఠశాలను సోమవారం ఎంఈఓ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి మండల విద్యాశాఖాధికారి టి.వెంకటేశ్వర్లు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి బీసీ తెలుగు పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసన పఠన సామర్థ్యాలను పరిశీలిస్తూ ఎఫ్ఎల్ఎన్ 75 రోజుల ప్రణాళికలో భాగంగా 3,4,5 తరగతులకు చెందిన విద్యార్థులు 80 శాతం మంది స్కూల్లో ఉన్నారని 20 శాతం మంది విద్యార్థులు కూడా స్కూల్‌కు వచ్చే విధంగా వారికి ప్రత్యేక రెమిడీయల్ క్లాసులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయురాలు నవ్య కి తెలియజేశారు. తదుపరి జాదు పిటా రే కిట్స్, చార్టులు, కార్డ్స్ ఉయోగించి విద్యార్థులకు సులభరీతిలో బోధించి వారు సులభంగా నేర్చుకునే విధంగా చూడాలని తెలియజేశారు. విద్యార్థులకు కనీసం వారంలో రెండు రోజులైనా లైబ్రరీ బుక్స్ ఉపయోగించే విధంగా చూడాలని తెలియజేశారు. అంతే కాకుండా పాఠశాల అనంతరం కనీసం ఒక అరగంట పాటు అయినా స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నవ్య, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 108లో గర్భిణీ ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం



**వింజమూరు, మార్చి 2, ప్రభాతవార్త :** వింజమూరు మండలం గుండెమండల గ్రామానికి చెందిన గొల్లపల్లి కెజియ అనే గర్భిణీకి పురిటి నొప్పులు అధికం కావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు 108 అంబులెన్స్ సిబ్బంది సమాచారం అందుకొని హుటాహుటీన గుండ మండల గ్రామానికి చేరుకున్నారు. గర్భిణీని తీసుకొని అంబులెన్స్‌లో వింజమూరులోని సీహెచ్‌సీకి వస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికమై అంబులెన్స్‌లోనే 3.5 కిలోల బరువున్న పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది తల్లి బిడ్డను స్థానిక సీహెచ్‌లో చేర్పించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని, ఎఈఎంటీ కే.సుభాని పైలెట్ ఎన్.నరేష్ బాబు తెలిపారు. కెజియ కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## నూరుశాతం పన్నుల వసూళ్లు లక్ష్యం



**వింజమూరు, మార్చి 2, ప్రభాతవార్త :** వింజమూరు మండల పరిధిలోని పంచాయతీలో నూరుశాతం పన్నులు వసూళ్ల లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు తెలిపారు. సోమవారం వింజమూరు పట్టణంలో పంచాయతీ పన్నులు నూరుశాతం వసూళ్ల లక్ష్యంగా పని చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో 46శాతం పన్నులు వసూళ్లు అయినట్లు ఆయన తెలియజేశారు. అదే విధంగా వింజమూరు మేజర్ పంచాయతీ పరిధిలో డిమాండ్ కోటి 50 లక్షలు కాగా అందులో 66 లక్షల 36 వేలు వసూళ్లు అయినట్లు డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు తెలిపారు. మిగిలిన పన్ను బకాయిలను ఈనెల 31వ తేదీ లోపు వసూళ్లు చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ వింజమూరు పంచాయతీ అభివృద్ధి పనులు చేసేందుకు పన్నులు వసూళ్లు తప్పక కావాలన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను అందించేందుకు ప్రజలు పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. పంచాయతీ అభివృద్ధి కోసం సర్పంచ్ తో కలిసి సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీఅభయాంజనేయస్వామి వారి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు



**వింజమూరు, మార్చి 2, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలోని ఎర్రబెల్లి పాలెంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి వారి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన అభయాంజనేయస్వామి వారి ప్రథమ వార్షికోత్సవ వేడుకలను అభయాంజనేయస్వామి భక్త బృందం ఘనంగా నిర్వహించారు. స్థానిక భక్తులు ఉదయాన్నే స్వామి వారి వద్దకు విచ్చేశారు. అర్చకులు రంగాచార్యులు, సాయి స్వామికి పంచామృ తాభిషేకము జరిపించారు. గణపతి పూజ నవగ్రహారాధన అష్టోత్తర శతనామావళి ఆంజనేయస్వామి వారికి ప్రీతికరమైన తమలపాకులతో ఆకు పూజ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి నేటికి సంవత్సర కాలం పూర్తయిందని ద్వితీయ వసంతంలోకి అడుగుపెడుతుందని అందుచేత స్వామివారి ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. స్వామివారి కరుణాకటాక్షాలతో ఈ గ్రామవాసులు అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉంటారని స్వామివారు తన చల్లని చూపులతో కాపాడుకుంటూ ఉంటారన్నారు. అనంతరం భక్తులకు భారీ అన్నదాన ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామి భక్త బృందం అధిక సంఖ్యలో మహిళా భక్తులు హాజరయ్యారు.

## జలజీవన్ మిషన్ పనులకు ప్రజలు సహకరించాలి



**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** జలజీవన్ పథకం కింద కోవూరులో ఎంపికైన పనులు సాగుతున్నాయి. ఈ మేరకు సోమవారం ఆ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీరు జగదీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ జలజీవన్ మిషన్ పనులు కొనసాగుతున్నాయని, ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నదే ప్రధాన ఆశయమన్నారు. స్థానిక నాయీ బ్రాహ్మణ వీధిలో జరుగుతున్న జేజేఎం పనులను ఆయన పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు.

## సర్వేయర్లకు పనిభారం తగ్గించాలి
## డిప్యూటీ తహసీల్దార్‌కు సమస్యల విన్నపం



**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** సచివాలయంలో పనిచేస్తున్న సర్వేయర్లకు పనిభారం ఎక్కువైందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సర్వేయర్లకు పదోన్నతి కల్పిస్తూ సరైన వేతనం చెల్లించాలని సోమవారం డిప్యూటీ తహసీల్దార్ బషీర్‌కు గ్రామ సర్వేయర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సర్వేయర్లు మాట్లాడుతూ తమకు అందించిన విధులు , బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం తమకు పనిభారం ఎక్కువైందని, బేసిక్ పే పెంచడమే కాకుండా ప్రమోషన్లు కూడా కల్పించాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ పంటలు అమ్మకాలు



**విడవలూరు,మార్చి 2 ప్రభాతవార్త:** తహశీల్దార్ కార్యాలయం ఆవరణం నందు పకృతి వ్యవసాయంతో పండించిన పంటలను పకృతి వ్యవసాయ సిబ్బంది స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎంఎంటి ఏ.లక్ష్మమ్మ,వి. నాగ లత మాట్లాడుతూ పకృతితో ఉత్పత్తి అయిన ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి మంచిదని వారు అన్నారు.అలాగే రైతు వద్ద నుండి నేరుగా వినియోగదారులకు విక్రయించడం అటు రైతులకు ఆదాయం, ఇటు ప్రజలకు ఆరోగ్యం కలుగుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పుష్పరాజ్యం, ఐ సి ఆర్ పి లు రాకేష్,బేబీ కుమారి, నరేష్, సురేష్, విజయలక్ష్మి, భాగ్య శ్యామల, రైతు లు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల వేదికలో అర్జీలు వెల్లువ



**విడవలూరు,మార్చి 2 ప్రభాతవార్త:** సోమవారం జరిగిన ప్రజా సమస్యల ప్రజావేదిక పరిష్కార కార్యక్రమానికి మండల ప్రజలు తహశీల్దార్ కార్యాలయంకు చేరుకుని అర్జీలను తహశీల్దార్ కె. చంద్రశేఖర్ కు అందజేశారు.ఈ ప్రజా వేదికలో ఆధార్, భూ విస్తరణం, మోటేషన్ కొరకు అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. వాటిని త్వరలోనే పరిష్కారం చేస్తామని ఆయన అన్నారు. అదేవిధంగా ఎంపీడీవో కార్యాలయంలో కూడా ఎంపీడీవో నగేష్ కుమారి ప్రజా వేదిక నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపరిన్టెంట్ వెంకట రమణమ్మ, డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణలత, మండల స్వర్ణ గ్రామ అధికారి శ్రీనివాసులు రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, హౌసింగ్ ఏఈ సాయి,పలు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యవసర సరుకులు పంపిణీ



**కావలి, మార్చి 2 ప్రభాతవార్త :** కావలి డిఎస్‌పి కార్యాలయంలో విదులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మురళి అనిత దంపతులు కుమార్తె వన్షిక జన్మదినం సందర్భంగా సోమవారం హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో 16వ వార్డు ముసునూరు దివ్యాంగుల కాలనీలో పేదలకు దుప్పట్లు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ముసునూరు దివ్యాంగుల కాలనీ అధ్యక్షులు మండవ వెంకట్రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కానిస్టేబుల్ మురళీ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమన్నారు. హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనిబాషా మాట్లాడుతూ ముందుగా వన్షికకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మురళీ అన్న వృధా ఖర్చులు చేయకుండా పేదలకు ఉపయోగపడేలా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకమన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు షేక్,మహబూబ్‌బాషా, వేణు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మందాటి చెరువు అలుగు కాలువ ఆక్రమణలు తొలగించాలి



**కావలి, మార్చి 2 ప్రభాతవార్త :** మందాటి చెరువు ఆక్రమణ తొలగించమంటే కేవలం పూడిక మారతమే తీసి ఆక్రమ నిర్మాణాలను తొలగించకుండా ఉన్న ఇరిగేషన్ అధికారులపై వామపక్ష నేతలు కన్నెర్ర చేశారు. మందాటి చెరువు అలుగు కాలువ ఆక్రమణలు తొలగించమని ఆర్డీఓకు సోమవారం మరోసారి వినతిపత్రం అందజేశారు. నేతలు మాట్లాడుతూ అధికారులే ఆక్రమణలు తొలగించకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఆక్రమణలపై పదే పదే వామపక్ష నేతలు అధికారుల మీద ఒత్తిడి తీసుకొస్తే కేవలం పూడిక పనులు మాత్రమే తీసి ఆక్రమ నిర్మాణాలను ఆదమరిచారన్నారు. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికాకుండా చూడాలిస్న బాధ్యత అధికారులపై ఉన్నా, అధికార పార్టీ నేతలు యదేచ్చగా ఆక్రమణలు జరుపుతున్నా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా మందాటి చెరువు అలుగు కాలువ ఆక్రమణలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వెంటనే ఆక్రమణలను తొలగించాల్సిందిగాఆర్డీఓ ఇరిగేషన్ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేత పసుపులేటి పెంచలయ్య, సిపిఐ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు, సిఐటియు నాయకులు క్రిష్ణ, న్యాయవాది కరవది భాస్కర్‌లు పాల్గొన్నారు.

## గ్రహణాల సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి అనేది మూఢవిశ్వాసం మాత్రమే

**కావలి, మార్చి 2 ప్రభాతవార్త :** గ్రహణాల ఖగోళ శాస్త్ర అద్భుతాలేనని గర్భిణీ మహిళలతో పాటు ఎవరైనా గ్రహణాల సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అనేది మూఢవిశ్వాసం మాత్రమేనని స్థానిక జనవిజ్ఞాన వేదిక పిలుపునివ్వడంజరిగింది. ఈసందర్భంగా వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి హరినాథ్, కార్యవర్గ సభ్యులు సోమారం ప్రకటనలో తెలిపారు. ఖగోళశాస్త్రవేత్తలు భూమి గుండ్రంగా ఉందని, సౌర కుటుంబంలో తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యునిచుట్టూ తిరిగే ఒక గ్రహం అని సూర్యుడు,చంద్రగ్రహం,భూగ్రహాలస్థానాలు మారుతున్నప్పుడు భూమిపై ఉన్న వారికి సూర్యగ్రహణం సమయంలో సూర్యుడు, చంద్రగ్రహణం సమయంలో చంద్రుడు కనబడకపోవడం జరిగే పరిణామం అని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇలాంటి మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయతను పెంచుతున్నారు. గ్రహణ సమయాల్లో దేవాలయాలను మూసివేయడం అనేది కేవలం మూఢ విశ్వాసం మాత్రమేనని తెలిపారు. ఇటువంటి దుష్ ప్రచారాలను ప్రభుత్వం కట్టుబడి ఉండడం వల్ల ప్రజల్లో మార్పు రాదని మార్పు వస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మూఢ విశ్వాసాలపై ప్రజల్లో చైతన్యం తెప్పించాలని విద్యావేత్తలను జనవిజ్ఞాన వేదిక కోరుతోంది.

## వ్యవసాయానికి పనికొచ్చే భూములను ఎస్‌సిలకు కేటాయిస్తే స్వాగతిస్తా



**కలువాయి మార్చి2 ప్రభాతవార్త :** గిరిజనులకు వ్యవసాయానికి పనికొచ్చే భూములను కేటాయిస్తా స్వాగతిస్తానని అంతే గాని చెరువు పోరంబోకు రాళ్ళగుట్టలను ఎస్‌టిలకు కేటాయిస్తున్న పేరుతో వారి సొంత ప్రయోజనాలకోసం ఉపయోగించాలనుకుంటే సహించేది లేదని కలువాయి జడ్‌పిటిసి బులగాకుల అనీల్‌కు మార్‌రెడ్డి పేర్కున్నారు.ఇటీవల అసెంబ్లీ సమావేశాలలోవెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ కలువాయి మండలంలో అనీల్‌కుమార్‌రెడ్డి భూ ఆక్రమణలు చేశారన్న ఆరోపణలపై అనీల్‌రెడ్డి స్పందించారు. ఇదే విషయంపై ఆదివారం టిడిపి మండల కన్వీనర్ చాల్లా రఘరామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో చేసిన విమర్శలపై స్పందిస్తు అనీల్‌కు మార్‌రెడ్డి సోమవారం విలేఖర్ల సమావేశంలో మాట్లా డుతు రఘ రామిరెడ్డి చేసిన ఆరోపణలకు ఆధారాలతో సహా సమాధానం ఇస్తునాన్నంటు తెలిపిన ఆయన మండలంలో ఎక్కడ ఇసుక దోపిడి జరుగుతుందో నిరూపించామని ఆయన అన్నారు.ఇసుక దోపిడి కోసమే మాజీ మండల కన్వీనర్‌ను తొలగించి రఘరామిరెడ్డినికన్వీనర్‌గా నియమించారని ఆరోపించారు. చెరువు పోరంబో కు తిప్పలను ఎస్‌టిలకు పంపిణీ పేరుతో ఆపార్టీనాయకులు పాలా పిచ్చిరెడ్డి తన క్రషర్‌కు వ్యక్తిగత ప్రయోజ నాలు ఉండడంతో ఈ విషయంలో నేనే కోర్టును ఆశ్రయించి స్టే తీసుకొని వచ్చినానని అన్నారు. చీటింగ్ వ్యవహారాలు ఉన్న వ్యక్తులు తనపై చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పవల్సని అవసరం లేదని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బురదచల్లే మాటాలు మానుకోవాలని హితవులు పలికారు.అదే విధంగా తెలుగురాయి పురంలో 120 ఎకరాల భూమిని కబ్జా చేస్తు టిడిపినాయకులు చేస్తున్న పనులను ఆగ్రామ సర్పంచ్ ,ప్రజలు అడ్డుకున్న విష యాన్ని ఆయన ప్రస్తావించారు.ప్రజల భూము లను ఆక్రమించే ప్రయత్నాలను సహించ బోమని స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మాకిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి,ఎంపిపి ఆర్ లక్ష్మీదేవి, వైస్‌ఎంపిపి పంగా పెంచలనరసారెడ్డి,మాజీ సొసైటీ అద్యక్షులు చల్లా సుబ్బరామిరెడ్డి,సర్పంచ్‌లు ఎంపిటిసిలు,పార్టీ సీనియర్‌నాయకులు పాల్గోన్నారు.

## కుడితిపాలెం గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



**ఇందుకూరుపేట, మార్చి 2, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా విద్యుత్ శాఖ అధికారి రాఘవేంద్రంని తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి షేక్ ఇస్మాయిల్ మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను పుష్పగుచ్ఛం అందజేసి ఘన ంగా సత్కరించారు. ఈ భేటీలో భాగంగా కుడితిపాలెం గ్రామంలో నెలకొన్న విద్యు త్ సమస్యలపై షేక్ ఇస్మాయిల్ ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో తాగునీటి సరఫ రాకు అంతరాయం కలగకుండా 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, అలాగే అవసరమైన చోట కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు, కొత్త విద్యుత్ లైన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజా సమస్యలపై స్పందించిన ఎస్ఈ రాఘవేంద్రం, కుడితిపాలెం గ్రామ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించారు. సమస్యలను పరిశీలించి త్వరలోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకు ంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైన్స్ కక్విజ్ విజేతలకు బహుమతులు పంపిణీ



**అనంతసాగరం,మార్చి2,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అనంతసాగరంలోని టిజెఎన్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. సోమవారం వైపి ఉపాధ్యాయ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెట్టుకూరు సు బ్బారెడ్డి ధాతృత్వంతో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల సిబ్బంది మెట్టుకూరు సుబ్బారెడ్డిని ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ భాండాగారి నారాయణరావు , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇలా వదిలేస్తే ఎలా..?

**ఉదయగిరి, మార్చి 2, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి నెల్లూరు వెళ్లే మార్గంలో ట్యాంక్ బ్యాండ్ ఆర్‌సీ దగ్గర పొంచి ఉన్న ప్రమాదం అర్థాంతరంగా నిలిపివేసిన పనులు ప్రధాన రోడ్డు పక్కన ప్రమాదంగా నిలిచిన గొయ్యి ఆదమరిస్తే ప్రమాదం తప్పదు అంటున్న ప్రయాణికులు ఇలా వదిలేస్తే ఎలా అంటూ స్థానికుల ప్రశ్నలు వస్తున్నాయి. కనీస భద్రతకు కూడా నోచుకోని ఆ ప్రదేశం ముందు జాగ్రత్త చర్యలు శూన్యం ప్రమాదాలు జరిగితే అప్పుడప్పుడు పట్టించుకుంటారేమో అంటూ విమర్శలు ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ఆనకట్ట నీళ్లు పోయేదానికి జేసీబీ సహాయంతో గుంతలు తీశారు అవి పోర్చుకుండా అట్లే ఉంచిపెట్టారు. రాత్రి పూట ద్విచక్ర వాహనాలు ద్విచక్ర వాహనాలు పోయేటప్పుడు మార్గమధ్యంలో కనిపించకుండా ప్రమాదం జరిగే సూచనలు ఉన్నాయని ప్రజలు అంటున్నారు. ఆనకట్టలో నీళ్లు పోయడానికి ఈ పక్క నుంచి ఆ పక్కకు పెద్ద పైపులు వేశారు. సగం వరకు వేశారు ఇంకా ఒక పైపు మందం వేయాల్సి ఉంది. ఆ గోతిని పూడ్చితే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి నిలిచిపోయిన పనిని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## మా పొలాలకు హద్దులు చూపండి

**– గుట్టు చప్పుడు కాకుండా కూల్లూరులో రీసర్వే**



**నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** 2012వ సంవత్సరంలో కలువాయి మండలం కుల్లూరు గ్రామం 660,661,662 నందు 20 20 ఎకరాల డి పట్టాలు ప్రభుత్వం పంపిణీ చేసి ఒదని, ఇటీవల కొందరు అక్రమంగా తమ భూ ముల్లో గ్రావెల్ తరలించి అమ్ముకున్నారని, పొలం హద్దులు చెరిగి పోయాయాని చేపల గుంతల తయారు అయ్యాయని, తమ పొలాలను సరి చేసి యదావిధిగా హద్దులు చూపాలని, తమ గ్రామంలో గుట్టు చప్పుడు కాకుండా భూ ఆసాములకే రీ సర్వే చేస్తున్నారని, చేతులు తడిపిన వారికే రీ సర్వే జరుగుతున్నదని కూల్లూరు ఎస్సిలు సోమవారం ప్రత్యేక గ్రీవెన్స్ నందు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు అర్జీ సమర్పించారు.

## ఇంటర్ విద్యార్థికి అస్వస్థత



**గూడూరు, మార్చి 2, ప్రభాతవార్త :** గూడూరు రెండో పట్టణ పరిధిలోని సెయింట్ మేరీస్ కాలేజీలో జూనియర్ ఇంటర్ పరీక్ష రాస్తున్న ధనుష్ అనే విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. రెండో పట్టణ పోలీసులు హుటాహుటిన ధనుష్‌ను సమీపంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలియజేశారు.

## శ్రీవారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు



**బిట్రగుంట మార్చి 2 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు తాళ్లూరు రోడ్డుమధ్య శ్రీవారి పాదాల వద్ద కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని శ్రీవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు .

## బోగోలులో విజయ గణపతి దేవస్థానం వార్షికోత్సవం



**బిట్రగుంట మార్చి 2 ప్రభాతవార్త :** బోగోలు మీద పంచాయతీలోని మార్కెట్ కూడలి లో ఉన్న శ్రీ విజయ గణపతి దేవస్థానంలో సోమవారం ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ విజయ గణపతికి అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గుడిలో పుష్పాలంకరణ చేశారు.

## ఎడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**తోటపల్లి గూడూరు, మార్చి 2, ప్రభాతవార్త :** మండలంలోని పేడూరు సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సహకార శాఖ అధికారి బి. గుర్రప్ప, జాఫర్ సాహెబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పేడూరు సహకార సంఘం అధ్యక్షుడు గూడూరు నారాయణ, మండల వ్యవసాయ అధికారి శిరీషా రాణి హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రైతులకు కొనుగోలు కేంద్రాల విధానం, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార శాఖ అధికారి గుర్రప్ప మాట్లాడుతూ గ్రేడ్ఏ రకానికి క్వింటాల్‌కు రూ. 2,389 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన గోని సంచులు, కూలీల చార్జీలు, రవాణా ఖర్చులు రైతుల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేయబడతాయని చెప్పారు. రైతులు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు తగ్గకుండా తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం మొత్తానికి సంబంధించిన చెల్లింపులు 24 గంటల లోపల రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సభ్యుడు ఎం. సీనయ్య, సూపర్వైజరీ అధికారి బొడ్డు సునీల్ కుమార్, సీఈఓ పీవీ రమణమూర్తి, తెలుగుదేశం పార్టీ నేత ముత్యాల శ్రీనివాసులు, రైతులు జి. సోమశేఖర్ రెడ్డి, ఎస్. శివయ్య, బి. నవీన్, పి. రాధాకృష్ణ, ఈ. రవి, సిహెచ్. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరంలో నారపరెడ్డి




**నెల్లూరు అగ్రికల్చర్, మార్చి 2, ప్రభాతవార్త :** రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన పది రోజుల శిక్షణా శిబిరం సోమవారంతో ముగిసిందని, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా శిక్షణ తరగతులు పూర్తి చేసుకుని శిబిరంలో రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ బలోపేతంపై చర్చించినట్లు తెలిపారు. వికారాబాద్ హరిత రిసార్ట్‌లో సంఘటన సృజన్ అభియాన్ పేరుతో పది రోజులు పాటు జరిగిన శిక్షణా శిబిరానికి రాష్ట్రంలోని డీసీస అధ్యక్షులంతా హాజరైనట్లు తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో పార్టీ సంస్థాగత బలోపేతం, నాయకత్వ సామర్థ్యాల పెంపు ప్రజలతో అనుసంధానం, ఎన్నికల వ్యూహరచన వంటి అంశాలపై సమగ్ర చర్చలు జరిగాయని తెలిపారు. అంతే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన డీసీసీ అధ్యక్షులు తమ తమ జిల్లాల రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై పార్టీ స్పందన తదితర అంశాలను విశ్లేషిస్తూ అనుభవాలను పంచుకున్నట్లు తెలిపారు.

## క్షయ నిర్మూలనకు అందరూ సహకరించండి



**నెల్లూరు, మార్చి 2, ప్రభాతవార్త –వైద్యం :** క్షయ వ్యాధిని నిర్మూలించే లక్ష్యంతో పని చేస్తున్నామని అందరూ సహకరించాలని జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎస్కే ఖాదర్ వలీ పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరులోని అపోలో హాస్పిటల్, మెడికల్ హాస్పిటల్ సిబ్బంది, వివిధ విభాగాల హెచ్ఓడీలతో క్షయ వ్యాధిపై రీ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఉంటే రెండు వారాలకు మించి దగ్గు జ్వరం ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇలాంటి లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి టీబీ హాస్పిటల్‌కి రెఫర్ చేయాలని సూచించారు. నాణ్యమైన క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు అవసరమన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలల పాటు క్షయ చికిత్సకు ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. వ్యాధి సోకిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లాలో ప్రస్తుతం నిర్వహిస్తున్న టీబీ ముక్త పంచాయతీ కార్యక్రమాన్ని కూడా క్లుప్తంగా వివరించారు. అపోలో మెడికవర్ హాస్పిటల్ వివిధ విభాగాల హెచ్ఓడీలు, జిల్లా టీబీ నివారణ పీపీఎం కోఆర్డినేటర్ భవ్య, ఫీల్డ్ కోఆర్డినేటర్ అనురాధ, డిస్టిక్ కోఆర్డినేటర్ తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## బట్టేపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ఆత్మకూరు, మార్చి 2, ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలం బట్టేపాడుగ్రామంలోని సొసైటీ భవనంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని సోమవారం టిడిపి నాయకులు, రైతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇస్తుందన్నారు. దాన్ని కొనుగోలు కేంద్రానికి చేరిన 24గంటల్లో రైతులకు నగదు జమ అవుతుందన్నారు. టిడిపి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రతి రైతు తాను పండించిన ప్రతి గింజను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు విక్రయించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపిపి కేతా వేణుగోపాల్‌రెడ్డి, బట్టేపాడు ఎంపిటిసి సభ్యులు తూమాటి శశిధర్‌రెడ్డి, సర్పంచ్ చెరుకూరు చిన్న చెంచయ్య, టిడిపి సీనియర్ నాయకులు కేతా విజయభాస్కర్‌రెడ్డి, వల్లూరి వెంకటరమణారెడ్డి, మండల యనిట్ ఇన్‌చార్జ్ కొండ్రెడ్డి రమణారెడ్డి, ఉప సర్పంచ్ వాసుపల్లి మురళీరెడ్డి, కోఆపరేటివ్ సీనియర్ సహాయకులు ఉష , సిఇ పద్మనాభరెడ్డి, విఎఇ శ్రీహర్ష, రైతులు ప్రసాద్‌నాయుడు, పెంచలనాయుడు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## సదరన్ సర్టిఫికెట్ల పై క్లారిటీ ఇవ్వండి



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 2, ప్రభాతవార్త :** సోమవారం నాడు ప్రజా విజ్ఞప్తుల దినంలో వైఎస్ఆర్‌సిపి దివ్యాంగుల విభాగం నెల్లూరు నగరం అధ్యక్షులు ఎస్కె సుభాన్ భాష, నెల్లూరు రూరల్ అధ్యక్షులు సాదు పెంచల రెడ్డి ఆధ్వర్యంలో సదరన్ సర్టిఫికెట్ల క్లారిటీ కొరకు నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సిపి దివ్యాంగుల విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల నాగేంద్ర మాట్లాడుతూ త్రీ వీలర్ స్కూటీల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లలో భాగంగా కొత్తది లేదా పాత సదరన్ సర్టిఫికెట్ లలో ఏ రకమైన సదరన్ సర్టిఫికెట్లను ప్రావీణ్యం లోనికి తీసుకున్నారో క్లారిటీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర అధ్యక్షులు ఎస్కె సుభాన్ భాష, నెల్లూరు రూరల్ అధ్యక్షులు సాదు పెంచల రెడ్డి, ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్‌స్కూల్లో 6వ తరగతి ప్రవేశపరిక్షకు దరఖాస్తుల ఆహ్వానం



**మర్రిపాడు, మార్చి2, ప్రభాతవార్త:** మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో చేరే విద్యార్థులకు ప్రవేశపరిక్ష నిర్వహించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్స్‌పాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉన్న విద్యార్థులు మార్చి 31లోపు వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఒసి, బిసి విద్యార్థులు 1.9.2014 నుండి 31.8.2016 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1.9.2012 నుండి 31.8.2016 మధ్య జన్మించి ఉండఆలని, ఒసి,బిసి విద్యార్థులు 200రూపాయలు, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు 125రూపాయలు దరఖాస్తు ఫీజు చెల్లించాలని, ర్పవేశపరిక్ష 12.4.26 ఉదయం 10నుండి 12 గంటల వరకు నందవరం ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తారని ప్రిన్స్‌పాల్ లక్ష్మీనారాయణ తెలిపారు.

## ఈతకెళ్లి యువకుడు మృతి



**దగదర్తి, మార్చి 2, ప్రభాతవార్త :** చెరువులో ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన దగదర్తి మండలం సున్నపుబట్టి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. యశ్వంత్ ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి సున్నపుబట్టి చెరువులో ఈతకు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం రోజు ఎంత గాలించిన యశ్వంత్ జాడ తెలియలేదు. సోమవారం రోజు దగదర్తి పోలీసులు రిస్క్ టీం సున్నపుబట్టి యువకుల సాయంతో ఎట్టకేలకు సాయంత్రం 3గంటల సమయంలో యువకుడు మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. సున్నంబట్టి గ్రామ ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు బెల్లంకొండ సీనమ్మకు ఇద్దరు కుమారులు. ఆమె పెద్ద కుమారుడైన యశ్వంత్(19) డిగ్రీ చదువుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి చెవరుకు ఈతకు వెళ్లాడని, చెరువులో దిగిన స్నేహితులు తిరిగి ఒడ్డుకు చేరారని యశ్వంత్ తిరిగి రాలేదని స్నేహితులు గ్రామంలోకి వచ్చి వారి బంధువులకి చెప్పడంతో, వారు వెళ్లి గాలించిన యశ్వంత్ జాడ తెలియలేదని చివరికి యశ్వంత్ మృతదేహం కనిపించిందని తెలిపారు. యశ్వంత్ మృతదేహాన్ని పోస్టుమార్టంకై నెల్లూరు జీహెచ్‌సీకి పంపించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపని కుమార్ తెలియజేశారు.

## ఆత్మకూరు నియోజకవర్గ యూత్ అధ్యక్షునిగా డాక్టర్ ప్రణీత్



**ఆత్మకూరు, మార్చి 2, ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజకవర్గంలో యువ నాయకత్వానికి ప్రాధాన్యతనిస్తూ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్‌ను ఆత్మకూరు నియోజక వర్గం యూత్ అధ్యక్షులుగా నియమించారు. ఈ నియామకం నియోజకవర్గం యువతకు కొత్త ఉత్సాహాన్ని అందించింది. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణీత్‌ను ఆయన చాంబర్‌లో ఘనంగా సన్మానించారు. వైసిపి ఆత్మకూరు రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తోడేటి అశోక్ ఆధ్వర్యంలో ఎస్సీ నాయకులు భారీగా పాల్గొని పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభా కాంక్షలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ యువతకు అవకాశంకల్పిస్తూ డాక్టర్ ప్రణీత్‌పై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన మేకపాటి విక్రమ్‌రెడ్డి నాయకత్వం ప్రశంసనీయమన్నారు. డాక్టర్ ప్రణీత్ ప్రజల సమస్యలపై స్పందిస్తూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సమర్థ నాయకుడన్నారు. తోడేటి అశోక్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి దూరదృష్టితోనే యువ నాయకులకు అవకాశం లభిస్తోందని, డాక్టర్ ప్రణీత్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు. డాక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచిన మేకపాటి విక్రమ్‌రెడ్డికి, సన్మానం చేసిన తోడేటి అశోక్‌కు , ఎస్సీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలు ఛలో విజయవాడ బాట



**కోట, మార్చి 2 ప్రభాతవార్త :** సమస్యల సాధన కోసం అంగన్‌వాడీలు పోరుబాట పట్టారు. సోమవారం కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి వందలాది మంది ఛలో విజయవాడ కార్యక్రమానికి తరలి వెళ్లారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు మూతబడ్డాయి. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న డిమాండ్‌తో నిరసన కార్యక్రమాలు వారంరోజులు నిర్వహించినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఛలో విజయవాడ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రాట్యుటీ అమలుకు మార్గదర్శకాలు రూపొందించడంతో పాటు మేనెలలో వేసవిసెలవుల జీవోను విడుదల చేయాలని కోరారు. జిల్లాలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాల్లో దాదాపు ఆరువేల మందికి పైగా కార్యకర్తలు, ఆయాలు అతి తక్కువ వేతనం పనిచేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఎన్నో హామీలిచ్చిన చంద్రబాబు తీరా గెలిచాక అమలు చేయడానికి డబ్బులు లేవంటున్నారని చెప్పారు. వాగ్దానాలు ఇచ్చే సమయంలో ఈ విషయం తెలియదా అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవాడకు వెళ్లిన మాట వాస్తవమే అని ప్రాజెక్టు సిడిపిఓ మునికుమారి చెప్పారు.

## హలో అనలేము.. సేవలు అందించలేము

**కోట, మార్చి2 ప్రభాతవార్త :** ప్రపంచీకరణ నేపథ్యంలో రోజురోజుకు సాంకేతికత పెరుగుతోంది. ప్రపంచంలో ఏ మూల నుంచి అయినా జరిగే సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునే పరిస్థితి అందుబాటులోకి వచ్చింది. కానీ అందుకు విరుద్ధమైన పరిస్థితి కోట మండలం గూడలి గ్రామంలో నెలకొంది. హలో అనే పరిస్థితి లేదు. ఎందుకంటే గూడలి కొండ కింద ఉండటం వలన సిగ్నల్ లేని కారణంగా ఫోన్లు పనిచేయక ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయంలో సిబ్బంది ముఖ హాజరు నమోదుకు ఎన్నో కష్టాలు. అయితే ఓ ప్రైవేటు సెల్ టవర్ వారు ఇక్కడ నిర్మాణం చేయాలని ప్రయత్నిస్తున్నారు. కొందరు మాత్రం ఆసెల్‌టవర్ వలన భవిష్యత్‌లో దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

## 256 మంది ఆడపిల్లలకు హెచ్‌పివి టీకా

**కోట, మార్చి 2 ప్రభాతవార్త :** గర్భాశయ క్యాన్సర్ రాకుండా నిరోధించడానికి 14 ఏళ్లు నిండిన ఆడపిల్లలందరికీ టీకాలు వేయడానికి వైద్య ఆరోగ్యశాఖ సన్నాహాలు చేస్తోంది. ఆ మేరకు ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. కోట మండలంలో 256 మంది 14 ఏళ్ల వయస్సు నిండిన బాలికలు ఉన్నారని చిట్టేడు ఆరోగ్య ఉపకేంద్రం డాక్టర్ నాగరాజు తెలిపారు. మరో రెండు మూడురోజుల్లో ఆరోగ్య కేంద్రాల్లో టీకాలు అందుబాటులోకి వస్తాయని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టిన ఈ టీకాతో భవిష్యత్‌లో గర్భాశయ క్యాన్సర్ రాకుండా నివారించవచ్చని డాక్టర్ నాగరాజు తెలిపారు. 14-15 ఏళ్ల వయస్సు ఉన్న వారికి ఈ టీకాలు వేస్తారని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో మూడు నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. తల్లిదండ్రుల సమ్మతితో చేతి కండరానికి టీకా వేస్తారని ఆయన చెప్పారు.

## రేబాల కాలువ పూడిక తీయాలంటు బిజెపి నేతల విజ్ఞప్తి



**బుచ్చి ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** జనతా వారధి కార్యక్రమంలో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం కమీషన్ డి.బాలకృష్ణకు పలు సమస్యలపై భారతీయ జనతాపార్టీ బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో అర్జీలు సమర్పించారు. బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ నడిబొడ్డులో ఉన్న రేబాల కాలవను పూడిక తీయించాలని వారు విజ్ఞప్తి చేశారు. రేబాల కాలువ చెత్తా చెదారం నిండిపోయి నీళ్ళు వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి అని వారు వివరించారు. రేబాల కాలువ దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిపోయిందని అన్నారు. అలాగే మలిదేవి కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేసే చోట సర్వీస్ రోడ్లుపై లైట్లు ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యాక్షులు కాసా శ్రీనివాసులు, ఓబిసి మోర్చ తిరుపతి జిల్లా ఇన్‌చార్జి గంజం పెంచలప్రసాద్‌మహిళామోర్చ నెల్లూరు జిల్లా ఉపాధ్యాక్షురాలు జడపల్లి రమణమ్మ, ఎస్‌సి మోర్చ నెల్లూరు జిల్లా ఉపాధ్యాక్షులు గోళ్ళ నరసింహులు, అర్బన్ ప్రధాన కార్యదర్శి గోలి సురేంద్ర, బిజెవైఎం అర్బన్ అద్యక్షులు తానా మణికంఠ,అర్బన్ ఉపాధ్యాక్షులు బొర్రు రామచంద్రయ్య, సందల నాగేశ్వరరావు, అర్బన్ కార్యదర్శి కాసా వెంకట నాగార్జున, వాసుదేవరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గోన్నారు.

## నేడు కొండబిట్రగుంట లో శ్రీ ప్రసన్నుడి కళ్యాణం

**బిట్రగుంట మార్చి 2 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండ బిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం చంద్రగ్రహణం కారణంగాఈ ఏడాది కళ్యాణాన్ని రాత్రి సమయంలో నిర్వహిస్తున్నారు. ఈ కళ్యాణ మహోత్సవం కొండ దిగువన ఇటీవల అమరాచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీ కృష్ణ కళ్యాణమండపంలో కళ్యాణం జరగనున్నది. కళ్యాణ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుండి విచ్చేసి వేలాదిమంది భక్తుల కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, కార్యనిర్వాహణాధికారి అరవ రాధాకృష్ణ తెలిపారు. కాగా సోమవారం మొక్కుబడుల సందర్భంగా వేలాదిమంది భక్తులు విచ్చేసి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. మొక్కుబడుల సందర్భంగా బిల కూట క్షేత్రంలో గోవింద నామస్మరణతో మారుమ్రోగింది

## ఇందిరమ్మను పరామర్శించిన వైసిపి నేతలు



**జలదంకి, మార్చి2, ప్రభాతవార్త:** జలదంకి వైసిపి మహిళానేత తిప్పారెడ్డి ఇందిరమ్మను ఆపార్టీ నేతలు, కార్యకర్తలు సోమవారం పరావర్శించారు. ఇటీవల ఇందిరమ్మ అనారోగ్యం బారీనపడి చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని తన కుమార్తె వద్ద విశ్రాంతి తీసుకుంటుంది. ఆరోగ్యం కుదుటపడిన అనంతరం జలదంకికివిచ్చేసింది .ఆమె రాకను తెలుసుకున్న వైసిపి మండలాద్యక్షుడు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, ఎస్‌వి శేషారెడ్డి, కోర్సిపాటి రామిరెడ్డి, వాకా మహదేవరెడ్డి, రఘురామిరెడ్డి, గుమ్మలంపాటి సుబ్బారావు, తదితర మండల నేతలు ఇందిరమ్మ నివాసానికి వెళ్ధి కలశారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంగూర్చి ఆరాతీశారు. జాగ్రత్తలు పాటించాలని సూసించారు..

## స్థలంకు హద్దులు చూపాలని వినతి



**కొడవలూరు, మార్చి2ప్రభాతవార్త:** స్థానిక తహశీల్దార్‌కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల ప్రజా వేదిక పరిష్కార కార్యక్రమానికి మండల ప్రజలు పాల్గొని తహశీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డికి సమస్యలను తెలుపుతూ విన్నతులు అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ జరిగిన ప్రజా వేదికలో రేగడిచెలిక గ్రామానికి చెందిన పెనుమాల పెంచలయ్య యాదవ్ ఇంటి స్థలం హద్దులు చూపాలని, అడంగల్, భూమిలో తప్పి దాలు, మోటేషన్‌కొరకు అర్జీలు వచ్చినవివాటిని సంబంధిత అధికారులకు తెలిపిజరుగుతుందని ఆమె అన్నారు.

## చలపతిరావుకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి



**కొడవలూరు, మార్చి 2 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీరి చలపతిరావు జన్మదిన వేడుకలు నార్త్ రాజు పాలెం వి సి ఆర్ అతిథి గృహం నందు రాష్ట్ర ,నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు మధ్య ఘనంగా జరుపుకున్నారు. తపా తోపు గేటు వద్ద ఉన్న విశ్వజనని బాలల ఆశ్రమం లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర పీఏసీ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, విసిఆర్ కు పుష్ప గుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు వైసీపీ నాయకులు కొండ్రెడ్డి రంగారెడ్డి, మావులూరు శ్రీనివాసులు రెడ్డి, కలువ బాల శంకర్ రెడ్డి, ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బచ్చు సుప్రియ ,నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు అనపల్లి ఉదయ భాస్కర్, మండల అధ్యక్షులు చిమటా శేషగిరి, కొండా శ్రీనివాసులు రెడ్డి, విడవలూరు మండల అధ్యక్షులు కాటంరెడ్డి నవీన్ రెడ్డి, జెడ్డా సాయికుమార్, దేవిరెడ్డి సాయి రెడ్డి, తాటిపర్తి భాస్కర్ మరియు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంచి ఆహారంతో ఆరోగ్యాన్ని పొందండి



**కొడవలూరు, మార్చి2 ప్రభాతవార్త:** మండల కేంద్రం తహశీల్దార్ కార్యాలయంలో పకృతి వ్యవసాయంతో పండించిన పంటలను ప్రకృతి బృందం రైతుల వద్ద నుండి నేరుగా వినియోగదారుల అమ్మకాల స్టాల్ ఏర్పాటు చేశారు. పకృతి కూరగాయలను తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి చేతుల మీదుగా వినియోగదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంటి శ్రీకాంత్, పకృతి వ్యవసాయ యూనిట్ ఇంచార్జ్ జి. కవితరాణి లు మాట్లాడుతూ పకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలు అనారోగ్య సమస్యలకు ఎంతో ఉపయోగపడుతూ మంచి ఆరోగ్యం పొందడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, ఏ ఎస్ ఓ గాయత్రి మరియు పకృతి వ్యవసాయ సిబ్బంది పి.రవీంద్ర, పి. అనూష, ఎస్.కె ఖసింబి, కే.శ్రావణి, వి.అర్చన, రాంప్రసాద్, కాళదేవ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం



**కొడవలూరు, మార్చి 2 ప్రభాతవార్త:** గ్రామ రెవెన్యూ అధికారులు ప్రజా సమస్యలను సేకరించి వారితో మర్యాదపూర్వకంగా నడుచుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ విధి నిర్వహణ చేయాలని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల గ్రామ రెవిన్యూ అధికారులతో తహశీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వీఆర్వోలు ఆయా గ్రామాలలో పక్కా గృహాలు లేని వారి కుటుంబాలను గుర్తించి ఒక ప్రక్రియ వేగవంతంగా తయారు చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పట్ల శ్రద్ధ వహించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, ఏఎస్ఓ గాయత్రి, ఆర్ఐ హైమావతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

## పన్నుల వసూళ్లకు సహకరించాలి



**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన గృహస్తులు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని డీఎల్‌పీవో డాక్టర్ పుట్టా రమణయ్య తెలిపారు. కోవూరు మండలంలోని ఇనమడుగు , వేగూరు, లేగుంటపాడు గ్రామాల్లో సోమవారం ఇంటి పన్నులపై సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీకి సకాలంలో ఇంటి పన్నులు, కుళాయి పన్నులు చెల్లిస్తే అభివృద్ధి పనులు మరింత వేగవంతం అయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. కోవూరు మండలానికి సంబంధించి 4.90 కోట్ల ఇంటి పన్ను డిమాండ్ ఉందన్నారు. ఇప్పటివరకు 2.5 కోట్ల ఇంటి పన్ను వసూలు అయిందని, మిగిలిన శాతాన్ని కూడా ఈ నెల 15వ తేది లోగా నూరుశాతం పూర్తి చేసేలా సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సలీమ్, తదితరులు ఉన్నారు.

## మత్స్యకారులు రాయితీని ఉపయోగించుకోవాలి

**కోట, మార్చి 2 ప్రభాతవార్త :** ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన మరియు మత్స్యశాఖ సంయుక్తంగా మత్స్యకారులు రాయితీ పరికరాలు అందిస్తారని ఎఫ్‌డిఓ రెడ్డి నాయక్ చెప్పారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో 'ప్రభాతవార్త'తో మాట్లాడారు. కోట మండలం గోవిందపల్లిపాలెంలో మత్స్యకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బోట్లు, వల, ఇంజన్‌తో కలిపి మూడు లక్షల 50 వేల రూపాయలను ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. అయితే అందులో రెండు లక్షల పదివేలు మాత్రమే ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలని కోరారు.

## పురుగుల మందు తాగి ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు గ్రామంలో సోమవారం విషాద చాయలు చోటుచేసుకున్నాయి. ఈ గ్రామానికి చెందిన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి పురుగుల మందు సేవించి ఆత్మ హ త్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పాటూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు పవన్‌సాయి(19) గంగవరం గ్రామంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున పవన్‌సాయి తన ఇంటిలోనే గడ్డిమందు సేవించాడు. కొద్దిసేపటికే వాంతి చేసుకోవడంతో గమనించిన తండ్రి పాటూరు గ్రామంలోని వైద్యుడు వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యాలరావు తెలిపారు. చేతికి అందివచ్చిన కొడుకు కళ్ల ముందే ప్రాణాలు కోల్పవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

## వాల్మీకి రామాయణపారాయణం ఎంతో ఉపయోగకరం



**కోవూరు, మార్చి 2 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న శ్రీ సత్యానంద ఆశ్రమంలో శ్రీ రామతీర్థ స్వామి వారి 97వ జయంతిని పుంస్కరించుకుని 10 రోజుల పాటు శ్రీ మద్‌వాల్మీకి రామాయణ పారాయణ కార్యక్రమాన్ని ఆలయంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరితీర్థ స్వామి మాట్లాడుతూ ఈ వాల్మీకి రచించిన రామాయణంలో ఎన్నో అంతు తెలియని విషయాలు సమగ్రంగా వివరించి ఉన్నారన్నారు. ప్రతి రోజు భక్తులు వచ్చి ఈ పుణ్యపారాయణ కార్యక్రమంలో పాల్గొని భగవంతుని అనుగ్రహాన్ని పొందాలని ఈసందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి శారద చిన్మయ ఒంగోలు ఆశ్రమ పీఠాధిపతులు బ్రహ్మశ్రీ సత్యాత్మనంద స్వామి, పురుషోత్తమ తీర్థస్వామి, శ్రీ రామ తీర్థస్వామీజీలు పలు విషయాలను భక్తులకు వివరించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.ఆశ్రమ కార్యదర్శి పోలిశెట్టి నాగేశ్వరరావు, భక్తులు ఉన్నారు.

## భూ కబ్జాదారుల పై చర్యలు చేపట్టండి



**గూడూరు, మార్చి 2, ప్రభాతవార్త** గూడూరు మండలం వెడిచర్ల గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా పశువుల మేతకు వాడుకుంటున్న భూమిని కొంతమంది రికార్డులను తారుమారు చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని గ్రామస్తులపై దౌర్జన్యం చేస్తున్నారని అధికారులు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సాల్మన్ రాజ్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్వో ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సాల్మన్ రాజ్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా 52 మంది ఎస్సీలు పశువుల మేతకు భూమిని వాడుకుంటూ జీవనం సాగిస్తున్నారని ఆ ప్రాంతంలో తెల్లరాయి ఉందని కొంతమంది అక్రమంగా రికార్డులను తారుమారు చేసి వారి పేరు మీద రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిపారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశామని స్పందించి చర్యలు తీసుకోవాలని వీరికి అండగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ బాషా ఖాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా వాటంబేడు శివ కుమార్ జన్మదిన వేడుకలు



**గూడూరు, మార్చి 2, ప్రభాతవార్త** గూడూరు శ్రీకృష్ణ ధర్మరాజుల స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ మాజీ కౌన్సిలర్ వాటంబేడు శివకుమార్ పుట్టినరోజు వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. గూడూరు పట్టణ సమీపంలోని గాంధీ నగర్‌లో ధర్మరాజుల స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ మాజీ కౌన్సిలర్ వాటం బెడ్ శివకుమార్ పుట్టినరోజు సందర్భంగా శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిమానులు, మిత్రులు ఏర్పాటు చేసిన కేకును శివకుమార్ కట్ చేసి అందరికీ అందించారు. నాయకులు మిత్రులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు అభిమానులతో సందడి వాతావరణం నెలకొంది. ఈయన వెంట వాటంబేడు హరి కుమార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎపిఎస్ఎస్ డిసి ఆధ్వర్యంలో రేపు జాబ్ మేళా

### ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి



**నెల్లూరు, మార్చి 2, ప్రభాతవార్త-వైద్యం :** తిరుపతిలోని ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో 4వ తేదీన జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో పొరుగుసేవల కింద ఉద్యోగాల కోసం అభ్యర్థుల ఒత్తిడి ఎక్కువగా వున్న నేపథ్యంలో వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ నియామకాలకై ఏపీఎస్పీడీసీఎల్ అభ్యర్థన మేరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎపిఎస్ఎస్‌డిసి) ఉద్యోగ నియామక ప్రక్రియను చేపట్టేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో 4వతేదీన ఉదయం 8:30 గంటల నుంచి జరిగే జాబ్ మేళాలో వివిధ ప్రైవేటు సంస్థల ప్రతినిధులతో అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించి, అభ్యర్థులను ఎంపిక చేసుకోవడం జరుగుతుందన్నారు. 10వ తరగతి, ఐటిఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ/బి.టెక్., పాసైన అభ్యర్థులు ఈ ముఖాముఖికి హాజరై ప్రముఖ ప్రైవేటు కంపె నీలైన టాటా ఎలక్ట్రానిక్స్, డాక్టర్ రెడ్డీస్, ఫాక్స్ కాన్, హుండాయ్ మొబిస్, షిరిడి సాయి, మెగా ఇంజ నీరింగ్, నవత ట్రాన్స్పోర్ట్, డిక్సన్ టెక్నాలజీస్, హీరో మోటాకార్ప్, అమరరాజా గ్రూప్,గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, ఎనర్జీ హార్వెస్ట్, అపోలో ఫార్మసీ, టివిఎస్ సుందరం ఫాస్నర్స్, ఇండో ఎంఐఎమ్, డైకిన్ తదితర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని తెలియజేశారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం..** విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ఏపీఎస్పీడీసీఎల్ కృషి చేస్తుందని ఆ సంస్థ చైర్మన్ !! మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 56 వినతులు అందినట్లు తెలిపారు. తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యలను పరి ష్కరించేందుకు ప్రాధాన్యతనివ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కా కుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధి కారుల దృష్టికి తీసుకురావచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అ యూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, ఆర్. పద్మ, కె. ఆదిశేషయ్య, ఎం. ఉమాపతి, యం. మురళీ కుమార్, యం. కృష్ణా రెడ్డి, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, జనరల్ మేనేజ ర్లు చక్రపాణి, సురేంద్రరావు, భాస్కర్ రెడ్డి, లత, తదితరులు పాల్గొన్నారు.

## నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డిని పరామర్శించిన వేమిరెడ్డి దంపతులు



**నెల్లూరు, మార్చి 2, ప్రభాతవార్త -వైద్యం** టీడీపీ సీనియర్ నాయకులు, నెల్లూరు సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డిని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు పరామర్శించారు. ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురైన జగన్‌మోహన్‌రెడ్డికి వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించారు. ఆపరేషన్ అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఆయన ప్రస్తుతం నెల్లూరులోని తన కుమార్తె నివాసంలో విశ్రాంతి తీసు కుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీవేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు వారి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోడూరు కమలాకర్‌రెడ్డి, కోట మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## విబి;జి రామ్‌జి నూతన చట్టంపై ప్రజా చైతన్య కార్యక్రమాలు

**కలిగిరి, మార్చి2, ప్రభాతవార్త;** వికసిత్ భారత్ రోజ్‌గార్ ,ఆజీవికా మిషన్ (గ్రామీణ)చట్టం 2025 ప్రకారం ప్రజా చైతన్య కార్యక్రమాలు, మార్గ దర్శకాలను ఆరు వారాల పాటుప్రజల్లోకి తీసుకుపోయి ప్రజల్ని చైతన్య పరిచే కార్యక్రమాలు ప్రభుత్వ మార్గ దర్శకాలతో చేపడుతున్నట్లు యంపిడిఓ ప్రత్యూష ఓ ప్రకటనలో తెలిపారు.25;2; 2026నుడి 27;3 2026వరకు మండల మరియు క్షేత్ర స్థాయిలోప్రజలకు అవగాహన కల్పించుటకు, ప్రతివారం జరుగుతున్న కార్యక్రమాల షెడ్యూల్ వివరాలను జిల్లా అధికారులకు పంపే విదం గ్రాప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో బాగంగా ఉపాదినుండి ఆస్తుల కల్పన ,హక్కుల పరిక్షణ,అన్ని గ్రామ పంచాయితీలలో వికసిత్ భారత్ గురించి తెలియ జేయుట,తదితర అంశాలు ఆరువారాలపాటు ఉంటాయన్నారు. ఇందులో సర్పంచిలు,ప్రజా ప్రతినిదులు, పొదుపు సంఘాలు,అంగన్ వాడీలు తదితరలతో సమావేశాలు ,ర్యాలీలు , శ్రామికులకు సన్మాన కార్యక్రమాలుఉంటాయన్నారు. పైకార్యక్రమాలలో ప్రజలందరూ పాల్గొనాలన్నారు.

### కళ్యాణం : కమనీయం

## శ్రీ రుక్మిణి సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి కళ్యాణ వైభోగం



**బుచ్చి మార్చి 3 ప్రభాతవార్త** ముత్యాల తలంబ్రాలు.. మంగళవాయి ద్యాలు... వేదమంత్రోచ్ఛరణ మద్య శ్రీరుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రుక్మిణి సత్యభామా సమేతుడైన శ్రీవేణుగోపాలస్వామి వారు వధువరులుగా కళ్యాణ వేదికపైన ఉండగా అర్చకులు అత్యంత వైభవంగా కళ్యాణం నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్ద ప్రసాదాలు పంపిణి చేశారు. ఉభయకర్తలుగా, పెనాక భాస్కర్‌రెడ్డి, పెనాక సుధాకర్‌రెడ్డి, పెనాక ప్రభాకర్‌రెడ్డి పెనాక శ్రీనివాసులురెడ్డి, పెనాక బలరామిరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పెనాక ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. రాత్రికి గజవాహనోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. భక్తులు గజవాహనోత్సవంలో స్వామి వారిని దర్శించుకొని తరించారు.

## ధాన్యం రైతులకు 24 గంటలలో నగదు చెల్లింపు డిసిఒ బి.గురప్ప



**బుచ్చి మార్చి 2 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం రూరల్ బ్యాంకు పరిధిలోని రేబాల గ్రామంలో బుచ్చి రూరల్ బ్యాంకు చైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి అద్యక్షతన రైతుభరోసా కేంద్రంలో డిసిఒ బి .గురప్ప ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతులతో వారు ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని రైతులందరికి లబ్ది చేకూర్చాలని కోతల కన్నా ముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తుందని వారు తెలిపారు.రైతులందరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలలోపు నగదు చెల్లించడం జరుగుతుందని అన్నారు. రైతులు దళారుల చేతులో మోసపోవద్దని ఆయన హెచ్చరించారు. ఇ- పంట నందు నమోదు చేసుకొని ఇ-కెవైసి పూర్తి అయిన రైతులు తమ ధాన్యమును విక్రయించుటకు సిద్దమైన రైతుల వద్ద నుండి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. జిల్లా కలెక్ట ర్,జాయింట్ కలెక్టర్ ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు విషయం పర్యవేక్షిస్తుంటారని అన్నారు. రైతు దళారుల చేతులో నష్టపోకుండా వుండాలని ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పిస్తుందని అన్నా రు.తేమశాతం 17 శాతం ఉండాలని వారు సూచించారు. రైతులకు గోతాల కొరత లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు ధాన్యం వాహనాలలో ఎగుమతి చేసినప్పటి నుండి రైసు మిల్లు వద్ద దిగుమతి అయ్యే వరకు జిపిఎస్ పరికరం ద్వారా ట్రాక్ చేయబడుతుందని చెప్పారు.వాహన యజమానులు తమ వాహనాలకు జిపిఎస్ పరికరాన్ని తప్పని సరిగా అమర్చి మాత్రమే ధాన్యం రవాణా చేయాలని అన్నారు. రైతులందరు పూర్తి వివరాలు రేబాల రైతులు బుచ్చిరెడ్డిపాళెం రూరల్ బ్యాంకు పరిధిలో తెలుసుకోవచ్చునని చెప్పారు. అలాగే అగ్రికల్చర్ ఎఇ శ్రీహరి దృష్టికి కూడా తీసుకొని వెళ్ళా వచ్చునని తెలిపారు. రైతులు అమౌంట్ విషయంలో ఎటువంటి సందేహాలు పడవద్దని ఆయన పేర్కున్నారు.ఈకార్యక్రమంలో కోవూరు ఎస్‌డిఎల్‌సిఒ ఎం.వి సుభాషిణి, డైరక్టర్లు మాచవరం శ్రీనివాసులు, కోనం క్రిష్ణయ్య సివిల్‌సప్లయ్స్ టెక్నికల్ అసిస్టెంట్ సుమతి సిఒకె అశోక్‌కుమార్, అడ్మిషన్ ఆఫీసర్ సురేష్‌రెడ్డి, రైతులు పాల్గోన్నారు.

## తన తండ్రి డాక్టర్ నాయుడు ఆశీస్సులు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది....

### ఆస్ట్రేలియా మెకానికల్ ఇంజనీర్ హర్షవర్ధన్ రాజా





**కావలి, మార్చి 2 ప్రభాతవార్త :** తన తండ్రి మాజీ మున్సిపల్ ఛైర్మెన్, ప్రజా వైద్యులు డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు ఆశీస్సులు అందుకోవడం చాలా సంతషంగా ఉందని ఆయన తనయుడు హర్షవర్ధన్‌రాజా తెలిపారు. గత 20సంవత్సరాలుగా ఆయిల్ రిఫైనరీ మెకానికల్ ఇంజనీరుగా ఆస్ట్రేలియాలో ఉంటున్న హర్షవర్ధన్‌రాజా కొంతకాలం తరువాత సోమవారం కావలి పట్టణానికి విచ్చేసిన సందర్భంగా ఆయనకు పలువురు వైద్యులు, పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు వివిధ స్వచ్చంద సంస్థలప్రతినిదులు, డాక్టర్ ప్రభాకర్ నాయుడు అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలతో,పూలమాలతో ఘనంగా సత్కరించి అభిమానాన్ని చాటుకొన్నారు.హర్షవర్ధన్‌రాజా తండ్రి, డాక్టర్ ప్రభాకర్‌నాయుడు ఆశీస్సులు అందుకొని ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం రాజా మాట్లాడుతూ భగవంతుని దయతో తల్లి దండ్రుల ఆశీస్సులతో క్షేమంగా ఉన్నానని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవాన్ని నమ్ముకోవాలని భగవంతుడు ఆశీస్సులు ఉండాలనానరు. తన తండ్రి ఆయురారోగ్యాలతో ఉంటూ మరెంత మందికి సేవ చేసే భాగ్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరారు. డాక్టర్ ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ నా తనయుడు హర్షవర్ధన్ రాజా నన్ను చూడడానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. చదువులో మంచి ఉత్తీర్ణత సాధించి గత కొన్ని ఏళ్లుగా ఆస్ట్రేలియాలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని ప్రముఖ కంపెనీలో మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేస్తూ అందరి అభిమానాలను పొందడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎంతోమంది ఉన్నారాజా లాంటి కుమారుడు ఒక్కరున్నాచాలని అంటుంటే గర్వంగా ఉండేదని కొంత బావోద్వేగానికి గురికావడం జరిగింది. రాజాకు ఘన స్వాగతం పలికి ఆశీస్సులు అందజేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.

## గ్లోబల్ స్కూల్ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**కావలి, మార్చి 2 ప్రభాతవార్త :** కావలి పట్టణం ముసునూరులోని గ్లోబల్ స్కూల్ నూతన భవనాన్ని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి రిబన్‌కట్ చేసి ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేక స్కూల్ యాజమాన్యం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలువతో సత్కరించారు. ఎమ్మెల్యే ముందుగా జ్యోతి ప్రజ్వళన చేసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని కరస్పాండెంట్ సాదనాల దామోదర్‌నాయుడుకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీగా సత్యనారాయణ

**నెల్లూరు క్రైమ్, మార్చి 2, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీగా ఉప్పాల సత్యనారాయణను నియమిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్యనారాయణ గతంలో నెల్లూరు జిల్లాలో మనుబోలు, టీపి గూడూరు ప్రాంతాల్లో ఎస్సైగా, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో సీఏ గా విధులు నిర్వహిస్తూ జిల్లా వాసులకు సుపరిచితులుగా ఉన్నారు. బుధవారం ఆయన డియేస్పిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## కోటి 12 లక్షలతో జెండాదిబ్బ సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం



**సంగం మార్చి 2 ప్రభాతవార్త** సంగం మండలం జెండాదిబ్బ గ్రామంలో కోటి 12 లక్షలతో మంజూరు అయిన సిమెంట్‌రోడ్డు నిర్మాణం పనులను సోమవారం మండల పార్టీ అద్యక్షులు బాణా శ్రీనివాసులురెడి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జెండాదిబ్బ గ్రామంలో తెలుగుదేశం పార్టీకిమంచి ఆదరణ ఉందని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కూడా మంచి మెజార్టీ వచ్చిందని అన్నారు. జెండాదిబ్బ నాయకులు నరేష్ నాయుడు మాట్లాడుతుజెండాదిబ్బ గ్రామానికి కోటి 12 లక్షల రూపాయాలు సిమెంట్‌రోడ్లు నిర్మాణానికి మంజూరు చేసిన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు సూరాయపాళెం పవన్‌కుమార్, చందు పఠాన్ ఫయాజ్, హసీప్ సర్దార్, టిడిపి నాయకులు పాల్గోన్నారు.

## కుమ్మరపల్లిలో సామూహిక మహాలక్ష్మీ పూజ



**కలువాయి మార్చి 2 ప్రభాతవార్త** మండలంలోని కుమ్మరపల్లి గ్రామంలో కలువాయి హిందూ ధర్మ పరిరక్షణ సమితిసమరసతా సేవా పౌండేషన్ వారి ఆద్వర్యంలో ఆదివారం రాత్రి గ్రామ దేవత శ్రీనాగారపమ్మ దేవస్దానం నందు గ్రామ పాలపొంగళ్ళు సందర్బంగా 108 మంది స్త్రీ మూర్తులతో సామూహిక మహాలక్ష్మ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారుప్రతి ఒక్కరు గ్రామాదేవతలను ఆరాధన చేయాలని మన ఆలయాలను కాపాడుకోవాల్సినఅవసరం ఎంతైనా ఉందని సమితి సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో సభ్యులు ప్రసాద్,శివకుమార్, జి.వి రమణయ్య, విష్ణునాద్‌రెడ్డి,గ్రామస్తులు పాల్గోన్నారు.

## ప్రారంభమైన ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం



**నెల్లూరు,మార్చి2 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్ధానిక స్టోన్‌హౌస్‌పేటలోని కేవీసీ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబందించిన జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ప్రారంభించారు.తోలి రోజు ఇతర జిల్లాల నుండి వచ్చిన సాంస్కృత జవాబుపత్రాలను మూల్యాంకనం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి,స్పాట్ వాల్యూషన్ అధికారి టి.వరప్రసాద్‌రావు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లాలో నేటి నుండి స్పాట్ వాల్యూషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రారంభించటం జరిగిందన్నారు.ఓ పక్క పబ్లిక్ పరీక్షల నిర్వహణ, మరో పక్క స్పాట్ వాల్యూషన్‌ను అధికారుల సమన్వయంతో విజయవంతంగా పూర్తిచేస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు. జిల్లాలోని లెక్చరర్స్ అందరూ వారికి విధులు కేటాయించిన తేదీల్లో తప్పక స్పాట్ వాల్యూషన్‌లో పాల్గొనాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐఓ కార్యాలయ ఏఓ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబటి కృష్ణారెడ్డికి మాతృవియోగం

### అంబటి లక్ష్మమ్మ మృతదేహానికి నివాళి అర్పించిన నెల్లూరు మాజీ ఎంపీ





**ఆత్మకూరు,మార్చి2,ప్రభాతవార్త:** వైఎస్ఆర్సిపి రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి అంబటి కృష్ణారెడ్డికి మాతృ వియోగం సోమవారం జరిగింది. అంబటి లక్ష్మమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో అంబటి కృష్ణారెడ్డి సోదరుడు అంబటి నారాయణరెడ్డి నెల్లూరులోని పప్పుల వీధిలో నివాసంలో ఉంటూ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్ఆర్సిపి నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి అంబటి లక్ష్మమ్మ మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు అంతిమయాత్రలో వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు పార్టీ అతీతంగా నాయకులు పాల్గొన్నారు..

## మినగల్లు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు



**బుచ్చి మార్చి 2 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెం మండలంలోని వవ్వేరు బ్యాంకు పరిధిలోని మినగల్లు గ్రామంలో వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ అద్యక్షతన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా డిసిఒ బి.గురప్ప హాజరైయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. రైతులందరు ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం అమ్మకాలు చేయాలని సూచించారు. 24 గంటలలో ధాన్యం నగదు చెల్లించడం జరుగు తుందని ఆయన తెలిపారు.ప్రతి రైతు ఇకెవైసి చేయించుకొని ఉండాలని అన్నారు. అనంతరం వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ మాట్లాడుతు రైతులందరికి పూర్తి స్దాయిలో న్యాయం చేయాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయిస్తున్నారని ఆమె ప్రశంసించారు.కోవూరు నియోజకవర్గం పూర్తి స్దాయి డెల్టా ప్రాంతం ఇక్కడ రైతుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎంతో అవసరమని గుర్తి మన శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాల పైన ప్రత్యేకదృష్టి పెట్టారని ఆమె కొనియాడారు.రైతులందరు ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం అమ్మకాలు చేయాలని ఆమె కోరారు. టిడిపి నాయకులు బొర్రరామ మాట్లాడుతు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని చెప్పారు.కోవూరు శాసన సభ్యురాలు మినగల్లు పాలతిప్ప వద్ద కల్లాలు ఏర్పాటు చేసేందుకు పూర్తి స్దాయిలో అనుమతులు తెస్తుందని ఇది మనకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. రైతులందరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్మకాలు చేసి మంచి ఆదాయం పొందాలని ఆయన కాంక్షించారు. ఈకార్యక్రమంలో బ్యాంకు డైరక్టర్ మాల్యాద్రి,సీనియర్ నాయకులు దొడ్ల కోదండరామిరెడ్డి.కోవూరు ఎస్‌డిఎల్‌సిఒ ఎం.వి సుభాషిణి, సివిల్‌సప్లయ్స్ టెక్నికల్ అసిస్టెంట్ సుమతి,అగ్రికల్చర్ ఏఒ శ్రీహరి బ్యాంకు సిఇఒ మన్నారపు శ్రీనివాసులు తదితరులు పాల్గోన్నారు.

## గూడూరు ప్రభాకర్‌రెడ్డి కుటుంబానికి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పరామర్శ



**ఇందుకూరుపేట, మార్చి 2, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలం కొమరిక గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు వైఎస్సార్‌సీపీ కుటుంబానికి వీరాభిమాని గూడూరు ప్రభాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో నేడు కొమరిక గ్రామంలోని స్వగృహానికి వెళ్లి స్వర్గీయ ప్రభాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర పీఏసీ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మవులూరు శ్రీనివాసులురెడ్డి, కలువ బాలశంకర్‌రెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, గడ్డవరపు వసంత కుమార్‌రెడ్డి, కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పాతపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**చేజర్ల మార్చి 2 ప్రభాతవార్త** చేజర్ల మండలంలో పాతపాడు, యనమదల గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా సొసైటీ అద్యక్షులు బూదళ్ళ వీరరాఘవరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతు వరి ధాన్యం గ్రేడ్ ఎ రకం క్వింటాలకు 2389 రూపాయాలు అలాగే సాధారరణ రకం క్వింటాలకు 2369 రూపాయాలకు కనీస మద్దతు ధర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ధాన్యం కొనుగోలకు సంబందించి ప్రతి రైతు వారి యొక్క నాణ్యత ప్రమా ణాలు పాటించాలని సూచించారు. 17 శాతం తేమ, ఉండాలి 17 శాతం ఉన్నటువంది ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హిమబిందు, వ్యవసాయ సిబ్బంది పాల్గోన్నారు.

## రెవెన్యూ,ఇరిగేషన్ శాఖల నడుమ తమ్ముళ్ల మజాకా దోపిడి



**విడవలూరు,మార్చి2 ప్రభాతవార్త:** మండలంలోని వరిణి చెరువు నుండి రెండవ రోజు కూడా అధికారుల అనుమతులు ఉన్నాయని తమ్ముళ్లు దర్జాగా మట్టి తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. వావిళ్ళ గ్రామానికి చెందిన ఓ నాయకుడు పరిపాలికుల పేరు చెబుతూ అడ్డగోలుగా అధికారులను బెదిరించి మట్టిని అక్రమంగా యథేచ్చగా బయటకు తరలిస్తున్నారు. అధికార పార్టీ పరిపాలికుల అండదండలతో తమ్ముళ్ల ధైర్యంగా మట్టి దోపిడీ చేస్తున్నారా అని ప్రజలు అనుకుంటున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ప్రభాతవార్త వివరణ కోరగా తహశీల్దార్ కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ వావిళ్ల గ్రామానికి చెందిన నాయకులు తమ దగ్గరికి వచ్చి వరిణి చెరువు నుండి ఇరిగేషన్ అధికారుల అనుమతులు తీసుకున్నాం అని చెప్పారు. రెవెన్యూ అనుమతులు ఇవ్వలేదని స్పష్టంగా తెలిపారు. ఇరిగేషన్ ఏఈ సురేష్ మాట్లాడుతూ నాయకులు తమ దగ్గరికి వచ్చి రెవెన్యూ అనుమతులు తీసుకున్నాం..మీరు కూడా అనుమతులు ఇవ్వండి అని అడిగారని ఆయన తెలిపారు. కానీ వరిణి చెరువు మట్టి తరలింపుకు ఇరిగేషన్ అనుమతులు ఇవ్వలేదని ఆయన తెలిపారు.

## ఉదయగిరి హౌసింగ్ గోడౌన్ ఇన్‌చార్జి ఏఈగా వెంకటేశ్వర్లు



**ఉదయగిరి, మార్చి 2, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి గృహ నిర్మాణ శాఖకు సం బంధించిన గోడౌన్ హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు అప్పగించారు. గతంలో ఉదయగిరి మండల హౌసింగ్ ఇన్‌చార్జి ఉన్న శకు నాలపల్లి ఇంజనీరింగ్ సహాయకులు రహమత్ షరీ ఫ్ తన ఆధీనంలోని రికార్డ్స్ గోడౌన్‌లో ఉన్న స్టీల్ సిమెంటు ఎలక్ట్రికల్ సామాగ్రిని ప్రస్తుత కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఏఈ వెంకటేశ్వర్లకు డీఈ హౌసింగ్ పీరా సమక్షంలో అప్పగించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.